సీఎం టూర్‌తో ప్రయాణికుల అవస్థలు

పెద్దపల్లి బస్టాండ్ లో ప్రయాణికుల రద్దీ

- బస్టాండ్లలో గంటల తరబడి పడిగాపులు
- మంచిర్యాల టూ హైదరాబాద్‌కు బస్సుల కొరత
- నిరీక్షించలేక అసహనం వ్యక్తం చేసిన ప్రయాణికులు

పెద్దపల్లి టౌన్, నవంబర్ 20: సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. సీఎం సభకు జనాలతో పాటు ఆర్టీసీ బస్సులను సైతం మళ్లించడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పెట్టి తమ జీవనోపాధి కొల్లగొట్టాడని ఆటో డ్రైవర్లు వాపోతున్న విషయం తెలిసిందే. ఇక రెండు రోజులుగా పెద్దపల్లి బస్టాండ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . సీఎం పర్యటన నేపథ్యంలో మంగళవారం వరంగల్, బుధవారం వేములవాడకు వందలాది ఆర్టీసీ బస్సులు తరలించారు. దీంతో మంచిర్యాల నుంచి హైదరాబాద్ వరకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పెద్దపల్లి నుంచి కరీంనగర్, హైదరాబాద్, మంథని, మంచిర్యాల, గోదావరిఖని, ఆసిఫాబాద్, మహారాష్ట్ర, భద్రాచలం, హుజూరాబాద్ డిపోలకు చెందిన బస్సులు ప్రతి 10 నిమిషాలు లేదా 15 నిమిషాలకో బస్సు కచ్చితంగా ఉంటుంది. అలాంటిది రెండు రోజులుగా పెద్దపల్లి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి దాదాపు ఐదు నుంచి ఆరు గంటలు ఇక్కడే నిరీక్షించాల్సి వస్తున్నదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి నుంచి బస్సులు లేకపోతే తాము గమ్యస్థానాలకు ఎలా వెళ్లాలంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో అనేక రైళ్ల హాల్టింగ్ ఉండడంతో ఇక్కడి నుంచి ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులే ఆధారం. రెండు రోజులుగా ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రజా పాలన అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మోసగిస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.

'సమగ్ర' సమాచారం విద్యార్థుల చేతికి..

- ఆన్‌లైన్ నమోదు సక్రమంగా జరిగేనా?

శిక్షణకు హాజరైన విద్యార్థులు

కోల్‌సిటీ, నవంబర్ 20: సమగ్ర ఇంటింటి కుటుంబ సమాచారం ఇప్పుడు విద్యార్థుల చేతికి వెళ్లబోతున్నది. సర్వే సమాచారాన్ని చాలా గోప్యంగా ఉంచుతామని చెబుతున్న ప్రభుత్వం ఇప్పుడు ఆ వివరాలను ప్రైవేటు వ్యక్తుల చేతికి అందిస్తున్నది. కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు సవ్యంగా జరుగుతుందా అన్న అనుమానాలకు తావిస్తున్నది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఇప్పటివరకు సేకరించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కమిషనర్ ఆదేశాలతో మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, సర్వే వివరాలు అంతా తెలుగులో ఉన్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థులు వాటిని ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయగలుగుతారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు తెలుగు సమగ్ర సమాచారం అర్థం చేసుకోవడానికే చాలా సమయం పడుతుంది. ఆన్‌లైన్‌లో నమోదు సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా తప్పుడు వివరాలు నమోదైతే బాధ్యులెవరనే ప్రశ్న తలెత్తుతుంది. గతంలో కూడా ప్రజా పాలన దరఖాస్తులు రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో దాదాపు 48వేల వరకు రాగా, వాటిని ఇదే జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. తీరా ప్రజాపాలన దరఖాస్తులు అధిక శాతం ఆన్‌లైన్‌లో చూపించలేదు. దీనితో లబ్ధిదారులు మళ్లీ నగర పాలక సంస్థ కార్యాలయంకు వచ్చి దరఖాస్తులు చేసుకునే పరిస్థితి నెలకొంది. ఉచిత కరెంటు, వంట గ్యాస్, తదితర పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అవి వర్తించకపోవడంతో అనుమానం వచ్చి లబ్ధిదారులు నగర పాలక సంస్థ కార్యాలయంలో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కాలేదని సిబ్బంది చెప్పారు. దీంతో బిత్తెరపోయిన లబ్ధిదారులు మళ్లీ కొత్తగా కార్యాలయంలో దరఖాస్తులు అందించారు. ఇలా ఒకటికి మూడు సార్లు దరఖాస్తులను కార్యాలయంలో ఇవ్వడానికే ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు అదే తప్పిదం మరోసారి చేయబోతున్నట్లు తెలుస్తోంది. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే వివరాలను బయటకు వెళ్లనీయమని చెప్పిన అధికారులు ఇప్పుడు బయటి విద్యార్థుల చేతికి ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఐతే ఈసారి కూడా విద్యార్థులు ఆ సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడంలో ఏమైనా పొరబాట్లు జరగవనే నమ్మకం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవం

ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, నాయకులు

పెద్దపల్లి రూరల్, నవంబర్ 20: దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవంతో బుధవారం జాతర ముగిసింది. పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు, ఏసీపీ గజ్జి కృష్ణయాదవ్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు లక్ష్మణ్ రావు, స్వామి, వెంకటేశ్, మౌనిక, లక్ష్మణ్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు భక్తులను జాతర ప్రాంగణంలోకి వాహనాలను అనుమతించకపోడంతో వాగ్వాదానికి దిగారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణయాదవ్, సీఐ ప్రవీణ్ కుమార్‌తో కలిసి బైక్‌పై జాతరలో తిరుగుతూ పోలీసులకు పలు సూచనలు చేశారు.

విజ్ఞాన సంపదకు నిలయం గ్రంథాలయం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్

బహుమతులు అందజేస్తున్న అన్నయ్య గౌడ్

పెద్దపల్లి కమాన్, నవంబర్ 20 : గ్రంథాలయాలు విజ్ఞాన సంపదకు నిలయాలని, విద్యార్థులు చిన్నప్పటి నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. వారం నుంచి నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశాన్ని పెద్దపల్లిలోని కేంద్ర గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ శాశ్వత భవనం నిర్మించేందుకు రూ. 6 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లోని విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. జిల్లా గ్రంథాలయ ఇన్‌చార్జి కార్యదర్శి కరుణకుమారి, కౌన్సిలర్ భూతగడ్డ సంపత్, నాయకులు భూషణవేని సురేశ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, జడల సురేందర్, సీఆర్పీ బాలసాని వెంకటేశ్, జూనియర్ అసిస్టెంట్ ఎండీ గఫార్, సిబ్బంది యూనుస్ ఖాద్రీ, స్వరూప, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల సందర్శన

వైద్య విద్యా విద్యార్థులో సంచాలకులు

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 20: గోదావరిఖనిలోని సిమ్స్‌ను తెలంగాణ వైద్య విద్యా సంచాలకురాలు డాక్టర్ వాణి బుధవారం సందర్శించారు. కళాశాలలో వివిధ విభాగాలను పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్య విద్య సంచాలకురాలిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇక్కడ సిద్దిపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విమల థామస్, సిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన

కేజీబీవీలో భోజనం చేస్తున్న కఠారి రేవతిరావు

జూలపల్లి, నవంబర్ 20 :తేలుకుంటలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కఠారి రేవతి రావు బుధవారం సందర్శించారు. మౌలిక వసతులు, డైనింగ్ హాల్, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ పలు విషయాలు అడిగి తెల్సుకున్నారు. అలాగే తేలుకుంటలోని అంగన్‌వాడీ కేంద్రం-2, చీమలపేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులకు సీమంతాలు చేశారు. ఇక్కడ ఐసీడీఎస్ సీడీపీవో కవిత, ప్రత్యేకాధికారి శ్రీలత, సూపర్‌వైజర్ తోట లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, మాజీ సర్పంచ్ గొడిశెల రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్

రామగిరి నవంబర్ 20 : ఆర్జీ -3 డివిజన్ నరేంద్ర సుధాకర్ రావు ఆదేశాల మేరకు ఆర్జీ -3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపునకు బుధవారం సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 173 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కోసం 78 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 22 మంది ఉద్యోగులు హాజరై, 21 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు అందజేస్తామని ఎస్వోటు జీఎం జి.రఘుపతి తెలిపారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బీ సుదర్శనం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, ఎన్ శ్రీనివాసరావు, డీపీఎం గుర్రం శ్రీహరి, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంఎస్ కార్యవర్గ సమావేశం

గోదావరిఖని, నవంబర్ 20: పట్టణంలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో బుధవారం యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు జక్కుల నారాయణ అధ్యక్షతన జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్ పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఆర్జీ-1 ఏరియా చౌరస్తాలో అక్రమ కూల్చివేతలపై నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసుకున్న నాయకులు బాధిత కుటుంబాలకు అండగా ఐక్యవేదిక సంఘాలు, కూల్చివేతను నిరసన వ్యక్తం చేశారు. ఐక్య సంఘాలతో కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరహారదీక్ష, , ఎన్ 1 రద్దుపై యాజమాన్యంపై ఒత్తిడి, సర్వెస్ జనరల్ మజ్దూర్ కార్మికులకు నష్టపోయిన బేసిక్ తిరిగి చెల్లింపుకు కార్యాచరణ, ప్లీమినరీ సమావేశం ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు.

మారుపేర్ల డిపెండెంట్ల నిరసన

గోదావరిఖని, నవంబర్ 20: సింగరేణిలో మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ప్రధానచౌరస్తాలో మారుపేర్ల డిపెండెంట్‌లు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మారుపేర్లతో నాలుగు ఏళ్లుగా విజిలెన్స్ ఫైల్స్ ముందుకు సాగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 28న జరుగనున్న స్ట్రక్చర్ సమావేశంలో తమ సమస్యను పరిష్కరించాలని వారు యాజమాన్యాన్ని కోరారు. ఇక్కడ మారుపేర్ల బాధితులు లక్క శ్రావణ్, తిరుమల, శ్రీనివాస్, సునీల్, మాచర్ల నవీన్‌కుమార్, బాలుగౌడ్, పొన్నం వెంకటేశ్, హరీశ్, కార్తీక్, ఆదినారాయణ, బొడిగె శ్రీకాంత్, రాజు, సత్యం, తదితరులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

కమాన్‌పూర్, నవంబర్ 20: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని ఎన్‌పీడీసీఎల్ మంథని డీఈ ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గుండారంతోపాటు కమాన్‌పూర్, రాజాపూర్ గ్రామాలలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ విద్యుత్ మీటర్లను పరిశీలించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. విద్యుత్ బిల్లులను డిజిటల్ ద్వారా చెల్లించవచ్చన్నారు. సుమారు 3వేల మీటర్లు పరిశీలించగా విద్యుత్ చౌర్యం కేసులు నమోదైనట్లు తెలిపారు. ఆయన వెంట పెద్దపల్లి డీఈ రవి, మంథని ఏడీ కనకయ్య, గోదావరిఖని ఏడీ శ్రీనివాస్, రామగుండం ఏడీ రమేశ్, చంద్రవర్ధన్, విజయ్‌కుమార్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్త శ్రీనివాస్

మంథని రూరల్, నవంబర్20: బుధవారం మండలంలోని ఆరెంద, మల్లారం, నాగేపల్లి, అడవి సోమన్‌పల్లి, చిన్న ఓదాల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పెద్ది ప్రభాకర్ రెడ్డి, రావికంటి సతీశ్, ఓదెలు, ఉడుతు మాధవి పర్వతాలు యాదవ్, నాయకులు కుడుదుల వెంకన్న, పేరవేన లింగయ్య, ఊట్ల అనిల్, గూడ శ్రీనివాస్‌లతో పాటు పలువురు ఉన్నారు.

పనితీరుతోనే గుర్తింపు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబర్ 20 : ఉద్యోగులు క్రమశిక్షణతో ఉత్తమంగా పని చేసినప్పుడే గుర్తింపు వస్తుందని ఆర్జీ-2 ఏరియా జీఎం బండి వెంకటయ్య అన్నారు. బుధవారం ఏరియా జీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా ఓసీపీ-3 ప్రాజెక్టులో ఉద్యోగులతో కలిసి ప్రాజెక్టు స్థితి గతులపై మాట్లాడారు. ఉద్యోగులు సమిష్టిగా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించినప్పుడే లక్ష్యాలను సాధించడంతోపాటు ఉద్యోగులకు, ప్రాజెక్టుకు గుర్తింపు వస్తుందన్నారు. సీనియర్ ఉద్యోగులపట్ల తోటి ఉద్యోగులు గౌరవ ప్రదంగా ఉండాలని, పారిశ్రామిక సంబంధాలను మెరుగుపరుచాలని సూచించారు. ఆనంతరం ప్రాజెక్టులోని డ్రిల్, బేస్ వర్క్‌షాప్, షావల్ సెక్షన్‌లను పరిశీలించారు. ఆయన వెంట ప్రాజెక్టు మధుసూదన్, ఎస్ఓటుజీఎం రాముడు, మేనేజర్ భరత్ కుమార్, గుర్తింపు సంఘం ప్రతినిధి రవీందర్ ఉన్నారు.

యాంటీబయోటిక్స్ పై అవగాహన

ధర్మారం,నవంబర్ 20: నంది మేడారం పీహెచ్‌సీ డాక్టర్ సుస్మిత యాంటీబయాటిక్స్ మందులపై వినియోగంపై రోగులకు బుధవారం అవగాహన కల్పించారు. వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే రోగులు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయ లలిత, ఫార్మాసిస్ట్ కృష్ణ, స్టాఫ్ నర్సులు కుంకుమ, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ అట్ల దామోదర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

పెద్దపల్లి టౌన్, నవంబర్20: ప్రైవేట్ వైద్యశాలల నిర్వాహకులు అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్నప్రసన్న హెచ్చరించారు. పట్టణంలోని విరాజ్, రహెమాన్ ప్రైవేట్ దవాఖానలను తనిఖీలు చేశారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ ఆక్ట్ 2010 ప్రకారం ప్రైవేట్ దవాఖానలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోవడంతోపాటు నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఇక్కడ డాక్టర్లు శ్రీరాములు, డిప్యూటి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆంజనేస్వామి విగ్రహం లభ్యం

పూజలు చేస్తున్న భక్తులు

జ్యోతినగర్, నవంబర్ 20: రామగుండం బీ పవర్‌హౌజ్ డౌన్ మున్సిపల్ వాటర్ ట్యాంకు సమీపంలో బుధవారం అతి పురాతనమైన ధనుర్బాణ ఆకృతిలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం చెట్లపొదల్లో లభించింది. ఇటీవల మేకల కాపరి విగ్రహాన్ని చూసి స్థానికంగా ఉన్న క్రష్ణర్‌నగర్ కాలనీవాసులకు సమాచారం ఇచ్చారు. వారు ఎన్టీపీసీ హిందువాహిని కార్యకర్తలకు తెలియజేయడంతో వారు విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఒడ్డున చేర్చి అర్చకుడు నాగరాజు చార్యులుతో పూజలు నిర్వహించారు. ఇక్కడ హిందూ వాహిని కార్యకర్తలు పైతరి రాజు, నవీన్, నరేశ్, మురళి, శేఖర్, ధీర్, సాయి ఉన్నారు.

అదనపు కలెక్టర్ తనిఖీలు

ధర్మారం, నవంబర్ 20: జిల్లా అదనపు కలెక్టర్ డీ వేణు మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించి తనిఖీలు చేపట్టారు. ధర్మారంలోని మీసేవా, ఆన్‌లైన్ సెంటర్లను పరిశీలించారు. అనంతరం నంది మేడారం పీహెచ్‌సీ, మల్లాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలపై డాక్టర్ సుస్మిత తో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట జిల్లా సివిల్ సప్లై అధికారి రాజేందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శ్రీకాంత్ ,మండల తహసీల్దార్ ఎండీ ఆరిఫొద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-1 వరలక్ష్మి, పత్తిపాక విండో సీఈవో బుచ్చయ్య ఉన్నారు.

విజయవంతం చేయాలి

సుల్తానాబాద్, నవంబర్ 20 : బీసీల సమరభేరి సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ కోరారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీల సమరభేరి పోస్టర్‌ను సుల్తానాబాద్ బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి నందగోపాల్, నాయకులు ఉదయ్, శ్రీమాన్ , అవారు లత పటేల్, చిగుర్ల శ్రీనివాస్,ఆకుల స్వామి వివేక్ పటేల్, గుర్రం సంపత్ గౌడ్, బింగి రాజు, ఆవుల వెంకటేశ్ యాదవ్, బండారి లక్ష్మణ్, బీసీ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, నవంబర్20: గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి సంబంధిత బిల్లులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అంగన్ వాడీ కేంద్రాల మరమ్మతు, టాయిలెట్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ విభాగం ద్వారా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఇక్కడ పీఆర్ ఈఈ గిరీష్ బాబు, సంబంధిత అధికారులు, ఏఈలు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 లోపు విద్యుత్ సరఫరా కల్పించాలి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సరఫరా పనులు డిసెంబర్ 15 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ సెంటర్లకు విద్యుత్ సరఫరాపై సంబంధిత అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. జిల్లాలోని 700 పైగా అంగన్ వాడీ కేంద్రాలకు ప్రత్యేక మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలన్నారు. అందుకు అయ్యే ఖర్చు ప్రతిపాదనలు నెలాఖరు నాటికి సమర్పిస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓసీపీ-2లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

రామగిరి, నవంబర్ 20: సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత సాధించడంలో డంపర్ ఆపరేటర్లుగా రాత్రింబవళ్లు అహర్నిశలు శ్రమిస్తూ నాలుగేళ్లుగా సీ గ్రేడ్ ఇవ్వాలని కాళ్లు అరిగేలా తిరుగుతున్నా రామగుండం రీజియన్ డి గ్రేడ్ ఆపరేటర్లను పట్టించుకునే వారే కరువయ్యారని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆర్జీ-3 ఓసీపీ-2లో బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. డీ గ్రేడ్ ఆపరేటర్లు మాట్లాడుతూ సింగరేణి చరిత్రలోనే డీ గ్రేడ్ ఆపరేటర్లకు సీ గ్రేడ్ పొందడంలో ఇంతటి జాప్యం జరిగిన సందర్భాలు లేవన్నారు. గత సెప్టెంబర్‌లోనే బీ గ్రేడ్ రావాల్సి ఉండగా, అసలు సీ గ్రేడే ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా కార్మిక సంఘాలు, యాజమాన్యం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా రేపు మాపు అంటూ తిప్పించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రెటరీ రామిడ్ల మనోహర్, అన్ని యూనియన్ నాయకులు, ఆపరేటర్లు బుడిగె క్రాంతి కుమార్, పూజారి కిరణ్, చంద్రమౌళి, సంజీవ్, అజీజ్, శ్రీనివాస రావు, అశోక్, రాజశేఖర్, రాజ్‌కుమార్, సత్తయ్య, రమేశ్, రాజు పాల్గొన్నారు.

26న దేశవ్యాప్త ఆందోళన

గోదావరిఖని, నవంబర్ 20: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలను నిరసిస్తూ ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26న దేశ వ్యాప్తంగా తలపెట్టిన ఆందోళనలను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ సంపద, ప్రభుత్వరంగ సంస్థలను బహుళజాతి కంపెనీలకు ధారదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఇక్కడ ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ నాయకులు కడారి సునీల్, వేల్పుల కుమారస్వామి, తోకల రమేశ్, ఐ కృష్ణ, కే విశ్వనాథ్, రైతు సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకన్న, రవి, నర్సయ్య, ఈ నరేశ్, బీ అశోక్, వైకుంఠం, చంద్రయ్య, రాజ మొగిళి ఉన్నారు.

పన్నూరులో డీఎల్పీవో పర్యటన

రామగిరి, నవంబర్ 20: పన్నూరు పంచాయతీలో బుధవారం మంథని డీఎల్పీవో సతీశ్ కుమార్ పర్యటించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యదర్శికి సూచనలు చేశారు. ఇంటింటా చెత్త సేకరణ జరగాలనీ, సెగ్రెషన్ షెడ్‌లో వేస్ట్‌ను అమ్మి ఆ డబ్బులను గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలని సూచించారు. ఇంటి పన్ను వసూళ్లు వంద శాతం జరగాలన్నారు. ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేయాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో ఉమేష్, కార్యదర్శి ప్రేమలత, కారోబార్ అభి తదితరులున్నారు.

కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లు

పెద్దపల్లి, నవంబర్ 20: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌తో పాటు జిల్లాలోని నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 48వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అలాగే నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా 3790 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిప